క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, దేవేరులను ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ భక్తుల కోసం అన్నదానం నిర్వహించింది.

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మండలంలోని పీరారామచంద్రపురంలో శ్రీ చక్ర ఆయిల్స్ సౌజన్యంతో ఆదివారం హీలియోస్ ఆస్పత్రి ఏర్పాటుచేసిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మోకాళ్లు, కీళ్ల నొప్పులు, తుంటి నొప్పులు, మోకాళ్ల వాపు, భుజం, కీళ్ల వాపులు బీపీ, షుగర్ వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారికి ఉచిత వైద్య సేవలు అందించడం సంతోషదాయకమన్నారు. ఆస్పత్రి వైద్య బృందాన్ని, శ్రీచక్ర ఆయిల్స్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, వ్యాపారవేత్త పడాల నాగిరెడ్డి, డాక్టర్ రఘు, శ్రీచక్ర ఆయిల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో నవసేన ఉమెన్ అండ్ సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ షేక్ ఫర్హాకాసర్ ఆదివారం తెలిపారు. బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి అతిథి గృహం వద్ద సోమవారం ఉదయం 9 గంటల నుంచి రక్త సేకరణ జరుగుతుందన్నారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సత్రం భూములను కాపాడాలంటూ ర్యాలీ



సుందరమ్మ సత్రం భూముల్లో ర్యాలీ చేస్తున్న రైతు కూలీలు

గోకవరం: రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూములను భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నాలను అధికారులు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరంజనేయులు సూచించారు. ఈ మేరకు రంపయర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూముల్లో ఆదివారం దళితులు, వెనకబడిన వర్గాలతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరంజనేయులు మాట్లాడుతూ సుందరమ్మ సత్రం భూములకు వేలం నిర్వహిస్తామని చెప్పి రెండు నెలలు గడుస్తున్నా అధికారులు నేటికీ వేలం నిర్వహించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగులు భూములకు వేలం నిర్వహించకపోతే అమరావతిలో దేవదాయ, ధర్మాదాయ శాఖ రాష్ట్ర కార్యాలయం ముందు దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, శ్రీకాంత్, గోలి మునలియ్య, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మెట్టకు ఊపిరులూదిన వర్షం

రంగంపేట: గత కొద్దిరోజులుగా కాస్తున్న ఎండలతో మెట్టప్రాంతంలోని పంట పొలాలు నోర్లెళ్లబెట్టాయి. ఖరీఫ్ కోసం వరి నాట్లు వేసిన తరువాత వర్షాలు కురవకపోవడంతో అవికాస్తా ఎండిపోయే స్థితికి చేరాయి. దీంతో రైతులు కొద్దిరోజులుగా ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజులు వర్షం కురవకుండా ఉంటే వరిచేలపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. అయితే శనివారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురవడంతో మెట్టలో చేలకు ఊపిరి అందినట్లయ్యింది. వరి చేలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు, ఉద్యానవన పంటలకు ఈ వర్షం మేలు చేసింది.

ఈ-పంట.. చింత లేదింక

- ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు
- పల్లెల్లో జోరుగా సాగుతున్న ప్రక్రియ



కైకవోలులో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు

పెదపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తున్నారు. విత్తు నుంచి పంట కొనుగోలు వరకూ రైతుకు అవసరమైన అన్ని సేవలను ఆర్‌బీకేల ద్వారా అందిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ-పంట నమోదును తీసుకొచ్చింది. దీనిద్వారా ఏయే రైతులు ఎలాంటి పంటలు ఎంత విస్తీర్ణంలో పండించారో స్పష్టంగా నమోదుచేస్తున్నారు. గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించి అన్నదాతలకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. ఏటా చేపడుతున్న ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో

రైతులు తమ పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం వల్ల బీమా, నష్ట పరిహారం చెల్లించడం, గిట్టుబాటు ధర కల్పించడం, సున్నా వడ్డీ అమలు, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం మంజూరు, ఉచితబోర్లు మంజూరు సులభతరమవుతాయి. ఈ-క్రాప్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రంలో ప్రతి రైతు భూమి వివరాలు గ్రామం, సర్వేనంబర్, ఆధార్ వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో పంట విక్రయించే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. ఈ-క్రాప్‌లో భాగంగా కౌలు రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆయా ప్రాంతాల్లో పంటలు పండించే వివరాలు, వ్యవసాయశాఖ గ్రామ స్థాయి అసిస్టెంట్లు ఈ-పంట విధానంలో నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తారు.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తోంది

ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ నమోదు విధానం రైతులకు వరంగా నిలుస్తుంది. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వరిలో నాట్లు వేయడం, వెదసాగు విధానాల్లో రైతులు సాగు చేపట్టారు. రైతు విత్తనం వేసినప్పటి నుంచి పంట కోసి విక్రయించే వరకూ ప్రక్రియ మొత్తం ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుతం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ జోరుగా సాగుతోంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల పంటలకు నష్టం కలిగితే పరిహారమందేలా ప్రభుత్వమే రైతుల పేరున ప్రీమియం సైతం చెల్లిస్తోంది. రైతులకు సూచనలు, సలహాలు అందించడానికి నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమంలోనూ ఈ-క్రాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అందుకే పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అనపర్తి నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాగు(ఎకరాల్లో)
అనపర్తి	9,550
బిక్కవోలు	15,741
పెదపూడి	18,000
రంగంపేట	2,776

నమోదు వేగవంతం చేస్తున్నాం



రైతులకు ఎంతో మేలు చేసే ఈ-పంట నమోదును వేగవంతం చేస్తున్నాం. ఈ-క్రాప్ నమోదు చేయడానికి గ్రామ వ్యవసాయ సహాయకుడు పంట పొలం వద్దకు వెళ్లి పొలం సర్వే నెంబరు, ఏ పంట సాగు చేస్తున్నారు, విస్తీర్ణం ఎంత తదితర వివరాలన్నీ నమోదు చేస్తారు. విత్తు నుంచి విక్రయం వరకూ మేలు చేసే ఈ-పంటను రైతులందరూ నమోదు చేయించుకోవాలి.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయశాఖాధికారి, పెదపూడి

ప్రతి పథకం నేరుగా రైతులకు



ఈ-పంట నమోదు కారణంగా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు దక్కుతుంది. రైతులు వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగే పని ఉండదు. పంటలు దెబ్బతిన్నపుడు ఈ-క్రాప్ నమోదుతో పంట నష్ట పరిహారం నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

– మార్ని వెంకట్రావు, పెదపూడి మండల రైతు విభాగం కన్వీనర్

రేపు డ్రైడే

మధురపూడి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం డ్రైడే నిర్వహించనున్నట్టు సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) కోరుకొండ సర్కిల్ సీఐ జి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆరోజు మద్యం అమ్మకాలు ఉండవన్నారు. మద్యం దుకాణాల విక్రయాలు నిర్వహించకూడదని, నిర్వహించే వారిపై కఠినమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

సీతానగరం: మండలంలోని మునికూడలి వద్ద స్కూటీని వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం రాజానగరం మండలం దివాన్ చెరువుకు చెందిన వేమగిరి నాగేశ్వరరావు తన భార్య కుమారితో కలిసి రఘుదేవపురంలోని తమ బంధువుల ఇంటికి స్కూటీపై వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరం, సీతానగరం రోడ్డులో మునికూడలి జగ్జీవన్‌రామ్ కాలనీ వద్ద స్కూటీని వెనుక నుంచి ఆటో వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కవచం అంబులెన్స్‌లో గాయపడిన ఇద్దరిని రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి అపస్మారక స్థితిలో ఉన్న కుమారిని దివాన్‌చెరువు వద్దగల మరో ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమయిన ముగ్గళ్ళకు చెందిన ఆటోను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఫ్లెక్సీ వివాదం

సీతానగరం: మండలంలోని కాటవరంలో ఫ్లెక్సీ వివాదం రాజుకుంది. వైఎస్సార్ సీపీ నాయకులు అనుమానితునిపై ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే శనివారం రాత్రి 11 గంటలకు కాటవరం సెంటర్‌లోగల వైఎస్సార్ సీపీకి చెందిన రెండు పెద్ద ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బీసీ కాలనీ వద్ద ఉన్న ఫ్లెక్సీని ధ్వంసం చేశారు. దీంతో కాటవరం ఎంపీటీసీ సభ్యుడు తాడిపల్లి వెంకటరావు అనుమానితుల పేరుతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, స్థానిక ఎస్సై కె. చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు ఫ్లెక్సీల ధ్వంసంపై తీవ్ర ఆగ్రహం వ్యక్త చేశారు. ఇటువటి విష సంస్కృతి రాకుండా చూడాలని పోలీసులను కోరారు. ఫిర్యాదులో సూచించిన కాత్రగడ్డ శివ గతంలో పలు వివాదాల్లో ఉన్నాడని, అతనిపై పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అనుమానం ఉందన్నారు. తక్షణమే విచారణ జరిపి దోషులను అరెస్ట్ చేయాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ ముందంజలో ఉందని, అందుకే ఇటువంటి విధ్వంసకర చర్యలు పాల్పడుతున్నారన్నారు. విష సంస్కృతిని ఎవరూ ప్రోత్సహించరాదని పార్టీ మండల కో కన్వీనర్ శ్రీహరిబాబు హితవు పలికారు. కాత్రగడ్డ శివను విచారణ నిమిత్తం సీతానగరం పోలీస్ స్టేషన్‌కు పిలిపించడంతో మండల టీడీపీ శ్రేణులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నాయి. ఎటువంటి అవాంఛనీ ఘటనలు జరుగకుండా కాటవరంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం



జి.మామిడాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో ఆదివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు టీడీపీ నాయకులే పొందారని, పేదలకు పథకాలు అందని ద్రాక్ష అయ్యాయన్నారు. జగనన్న సీఎం అయ్యాక తమ ఇళ్ల ముంగిటకే పథకాలు అందుతున్నాయంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పేదల అభ్యున్నతికే సీఎం జగన్ నవరత్న పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అవినీతికి తావులేకుండా, పార్టీల ప్రమేయం లేకుండా, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దళితులు, మహిళల అభ్యున్నతికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఇప్పుడు చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. రెండోసారి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కర్రి శ్రీవెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, ద్వారంపూడి శ్రీనివాసరెడ్డి, పప్పు చిన్నారెడ్డి, సబ్బెళ్ల భీమ్, ఎన్‌వీవీ రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రారంభోత్సవాలు

రాజానగరం: నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో కనీవినీ ఎరుగని రీతిలో రూ.8 కోట్ల 38 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభోత్సవాలు జరుగనున్నాయి. ఉదయం 10 గంటలకు రావుల చెరువు గట్టున నిర్మించిన ఘాట్, పార్కు, వ్యాయామశాలల ప్రారంభోత్సవంతో మొదలై మధ్యాహ్నం 2 గంటలకు వెలుగుబంద రోడ్డులో నిర్మించిన గోదావరి వాటర్ సంప్, పంప్‌హౌస్ ప్రారంభోత్సవం వరకు 21 చోట్ల ప్రారంభోత్సవాలు జరిగేలా షెడ్యూల్‌ని విడుదల చేశారు. అనంతరం 970 మంది నిరుపేదలకు నివాస స్థలాలను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఫెలోషిప్‌లు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినల్ ఎండో సర్జన్స్ (ఐఏజీఈఎస్) సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో 120 మంది పీజీ విద్యార్థులు లాప్రోస్కోపీ సర్జరీలో శిక్షణ పొందారని ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సెక్రటరీ డాక్టర్ సమీర్ రంజన్ నాయక్ తెలిపారు. మరో 50 మంది విద్యార్థులు, వైద్యులు ఎగువ ఉదరకోశంలో, లివర్, గాల్‌బ్లాడర్, పాంక్రియాస్ తదితర వాటికి ఎండోస్కోపీతో పరీక్షలు, చికిత్సకు సంబంధించిన శిక్షణను పూర్తి చేసుకుని ఫెలోషిప్ ఇన్ అడ్వాన్స్‌డ్ జీఐ ఎండోస్కోపీ- ఎండోస్కోపీ రెట్రోగ్రేడ్ కొలాంజియా పాంక్రియోటోపోగ్రఫీ (ఎఫ్ఏజీఐఈ ఈఆర్‌సీపీ) ఫెలోషిప్‌లు సాధించుకున్నారన్నారు. 50 మంది ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ గ్యాస్ట్రో ఇంటస్టెయినల్ ఎండో సర్జన్స్ ఫెలోషిప్ పొందారన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగించుకుందాం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కణుపూరులో గడప గడపకూ మన ప్రభుత్వం
- గ్రామంలో రూ.5.20 కోట్లతో అభివృద్ధి



కణుపూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా

మధురపూడి: పేద వర్గాలకు జగనన్న సంక్షేమ పథకాలే అండగా నిలిచాయని, ఈ ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగించుకోవడానికి ఐక్యం కావాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కణుపూరు గ్రామంలో ఆదివారం రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత రామాలయంలోని శ్రీరామచంద్రుడిని దర్శించుకున్నారు. ఎస్సీపేటలోని దివంగత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కణుపూరు గ్రామాభివృద్ధికి రూ.5.20 కోట్ల నిధులు కేటాయించి, ఖర్చు చేసినట్టు తెలిపారు. మరింత అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పథకాలను అర్హులందరికీ వర్తింపజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదన్నారు. సాయంత్రం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఎస్సీ కాలనీ, బీసీ, ఓసీ పేటల్లోని 300 గడపలు తిరిగారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు పూలజల్లులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కోరుకొండ మండలం కో-కన్వీనర్ గణేశుల పోసి, కణుపూరు సర్పంచ్ కరణం రమణ, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్డి జయలక్ష్మి, పార్టీ నాయకులు కళ్యాణం చిట్టిబాబు, కళ్యాణం రాంబాబు, మంచాల చిట్టిబాబు, సంగం రామకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ విభాగాల అధ్యక్షులు వీరే



మాలపాటి దుర్గారావు



దాసరి ఏసు



టేకి ఉమామహేశ్వరరావు

రాజానగరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్టీ సెల్ విభాగానికి మూడు మండలాలకు అధ్యక్షులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం ప్రకటించారు. రాజానగరానికి మాలపాటి దుర్గారావు, కోరుకొండకు దాసరి ఏసు, సీతానగరానికి టేకి ఉమామహేశ్వరరావును నియమించారు.

మహిళలతో జెండా ఆవిష్కరణలు

సీతానగరం: భారతీయ యువజన కాంగ్రెస్ శక్తి సూపర్ షీ ప్రధాన కార్యక్రమంలో ఆగస్టు 15న మహిళలతో జాతీయ జెండాను ఎగురవేయిస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి మహిళ సాధికారత పొందనంత వరకు భారతదేశం బలంగా మారదన్నారు. జాతీయ జెండాలను మండల కేంద్రాలలో ఎగురవేయిస్తామన్నారు.

మణిపూర్ క్రైస్తవుల కోసం శాంతి ర్యాలీ



రాధేయపాలెంలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రాజానగరం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులు అమానుషమంటూ పాస్టర్స్ ఫెలోషిప్ ఆవేదన వ్యక్తం చేసింది. వారికి సంఘీభావాన్ని తెలియజేస్తూ మండలంలోని రాధేయపాలెంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, ప్రజా జీవనం సాఫీగా జరిగేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జి.రాజు, ఎస్.ఏసయ్య, ఎస్.జయబాబు, జి.కృపారావు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే రాజా పరామర్శ



బూరుగుపూడిలో అబ్రహం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజా

మధురపూడి: కోరుకొండ మండలంలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబాలను రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. బూరుగుపూడికి చెందిన ఏగు అబ్రహం తల్లి పాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మునగాల గ్రామానికి చెందిన మండపాక శ్రీను తండ్రి కామేశ్వరరావు, ఇతర కుటుంబాలకు చెందిన మండపాక నాగమణి, అంబటి లక్ష్మణస్వామి మృతి చెందారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

పొంచి ఉన్న ప్రమాదం

- బొబ్బిల్లంక-మిర్తిపాడు కల్వర్టు వద్ద జోరుగా అనధికార చేపల వేట
- వారం రోజుల క్రితం చేపలవేటలో వ్యక్తి గల్లంతు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు



కల్వర్టు వద్ద తెల్లవారుజామున వలలను లాగుతున్న చేపల వేటగాళ్లు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక - మిర్తిపాడు మధ్యలో కల్వర్టు వద్ద పెను ప్రమాదం పొంచి ఉంది. ఈ నెల 5న పీతల శ్రీనివాస్ ఇదే కల్వర్టు వద్ద చేపలు పట్టుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో కొట్టుకుపోయాడు. మూడు రోజుల గాలింపు అనంతరం మృతదేహం లభ్యమైంది. కొన్నేళ్ల క్రితం ఇదే కల్వర్టుపై నుంచి కారుతోపాటుగా కాలువలోకి దూసుకుపోయి ముగ్గురు విద్యార్థులు మరణించారు. వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదం మరవకుండానే చేపల వేట పేరుతో మరో ప్రమాదానికి కొందరు తెర తీస్తున్నారు. మిర్తిపాడుకు చెందిన పదిమంది టీమ్‌గా ఏర్పడి కల్వర్టు వద్ద చేపల వేటను జరుపుతున్నారు. వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంతో అధికారులు చేపల వేటను నిషేధించారు. అయితే మిర్తిపాడుకు చెందిన చేపల వేటగాళ్లు మాత్రం రాత్రి 9.30 గంటల నుంచి 11 గంటల మధ్య చేపల వలలను ఏర్పాటు చేసుకుని తిరిగి ఇళ్లకు చేరుకుంటున్నారు. అనంతరం తెల్లవారుజామున 4 గంటల నుంచి 5 గంటల మధ్య కల్వర్టు వద్దకు వచ్చి చేపలకు వేసిన వలలను కల్వర్టుపైకి లాగుతున్నారు. దీనితో స్థానికులు కూడా తెల్లవారుజామున కల్వర్టుపైకి చేరుకుని చేపలను కొనుగోలు చేస్తున్నారు. అయితే కల్వర్టు వద్ద తక్కువగా అమ్మకాలు జరిపి గ్రామంలోకి చేపలను తరలిస్తున్నారు. గ్రామ పెద్దలు మౌనం వహించడంతో చేపల వేట జోరుగా సాగుతోంది. మరో ప్రమాదం జరిగి ప్రాణాలు పోకుండానే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ ఇంటి పైనా జాతీయ పతాకం ఎగరాలి

రాజమహేంద్రవరం సిటీ: ప్రతీ ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావజాలాన్ని పెంపొందించే విధంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని శ్రీ పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ ట్రస్టు చైర్మన్ పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ విజ్ఞప్తి చేశారు. భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఆదివారం నగరంలో కంబాల చెరువు ప్రాంతంలో శ్రీ పరవస్తు సత్య గోపీనాథ్ దాస్ ట్రస్టు ఆధ్వర్యంలో భారత జాతీయ జెండాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల ఐక్యతకు ప్రతీకగా 14, 15 తేదీలలో ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్

కంబాలచెరువు: స్థానిక వేంకటేశ్వరనగర్‌లోని ఎస్‌బీఐ పార్క్‌లో ఆదిత్య ఉభయ డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్. వలంటీర్లు, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి నిత్య విద్యార్థి, బీసీ రాయ్ అవార్డు గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి హాజరయ్యారు. దీనిలో భాగంగా 25 మొక్కలను వలంటీర్ల ఆధ్వర్యంలో నాటారు. పార్కు ప్రాంతంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ జి.నాగేశ్వరరావు, డాక్టర్ బీఆర్ రమాదేవి పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో వలంటీర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎన్.రెహమాన్ వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో కె.సుధాకర్ పట్నాయక్, రేన్ బో కే్సీ సత్యనారాయణ, శశికుమార్, ఇంజినీర్‌మూర్తి, అన్నమయ్య పాల్గొన్నారు.